క్లుప్తంగా

ప్రశాంతంగా గురుకుల పరీక్ష

ఇచ్చోడ: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా సాగింది. గిరిజన గురుకుల బాలుర పాఠశాలల్లో 384 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా.. 359 హాజరైనట్లు ప్రిన్స్‌పాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. బాలుర పాఠశాలలో 288 మంది విద్యార్థులకు 270 మంది విద్యార్థులకు 260 మంది హాజరైనట్లు ప్రిన్స్‌పాల్ లక్ష్మీకాంత్ రావు తెలిపారు. పరిశీలకుడు ఆనంద్‌రెడ్డి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

బోథ్‌లో వర్షం

బోథ్: బోథ్ మండల కేంద్రంతో పాటు కనుగుట్ట, కౌఠ, జీడిపల్లె, పొచ్చెర, కుచులాపూర్ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. నాలుగు రోజులుగా ఎండలతో సతమతమవుతున్న ప్రజలకు ఉపశమనం కలిగింది. మొక్కజొన్న పంటలపై రైతులు కవర్లు కప్పి ఉంచారు.

విగ్రహావిష్కరణ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చించుఘాట్ పరిధిలోని దివ్యగూడలో నూతనంగా ఏర్పాటు చేసిన కిక్రి వాయిద్యా కళాకారుడు కుమ్ర లింగు విగ్రహాన్ని ఆదివారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ గండ్రత్ రమేశ్, సర్పంచ్ కుమ్ర శ్యాంరావ్, జంగు బాపు, పరమేశ్వర్ పాల్గొన్నారు.

కండక్టర్ నిజాయతీ

ఆదిలాబాద్: ఆదిలాబాద్ డిపో ఆర్టీసీ కండక్టర్ శ్రీనివాస్ రెడ్డి తన నిజాయతీని చాటుకున్నాడు. ఆదిలాబాద్ డిపో నుంచి హైదరాబాద్ వెళ్లే సూపర్ లగ్జరీ బస్సులో ఆదివారం నిర్మల్ వరకు శాభాజుద్దీన్ అనే ప్రయాణికుడు నిర్మల్ వరకు ప్రయాణించి తన బ్యాగును మర్చిపోయాడు. గమనించిన కండక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆదిలాబాద్ డిపో మేనేజర్‌కు సమాచారం ఇచ్చారు. ప్రయాణికుడి వివరాలు సేకరించి బ్యాగు అందజేశాడు.

బస్సు సర్వీస్ ప్రారంభం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ పట్టణ, గ్రామీణ ప్రజల సౌకర్యార్థం ఉట్నూర్ నుంచి గుడిహత్నూర్, నిర్మల్, ఆర్మూర్ మీదుగా హైదరాబాద్‌కు సూపర్‌లగ్జరీ బస్సు నడపడం జరుగుతుందని ఉట్నూర్ డిపో మేనేజర్ కల్పన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పించడం జరుగుతుందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కాంగ్రెస్ ఎల్‌డీఎం సమన్వయకర్తల నియామకం

బోథ్: యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం కోసం ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఎస్టీ నియోజకవర్గాల్లో లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్‌లో భాగంగా బోథ్, ఖానాపూర్‌లకు సమన్వయకర్తలను నియమించింది. బోథ్‌కు ధన్నూర్ గ్రామానికి చెందిన పసుల చంటి, ఖానాపూర్‌కు బోథ్‌కు చెందిన మల్లెపూల సత్యనారాయణలను నియమించారు. వీరు యువతకు నాయకత్వంపై శిక్షణ ఇవ్వనున్నారు.

సన్మానం

బోథ్: లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్‌లో భాగంగా బోథ్ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా నియమితులైన పసుల చంటిని నేరడిగొండ మండలానికి చెందిన సెరికల్చర్ లైసెన్ అధికారిణి రాథోడ్ పార్వతి ఆదివారం బోథ్ మండల కేంద్రంలో సన్మానించారు. బానోత్ కర్ణ, మండల కన్వీనర్ మహేందర్, రవీందర్, గంగారెడ్డి, ప్రవీణ్, శ్రీకాంత్, శశికాంత్ పాల్గొన్నారు.

విరాళం

తాంసి: మండలంలోని కప్పర్లలో నూతనంగా నిర్మిస్తున్న రాంమందిర్ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన ఉపలంచి గంగాధర్ తన వంతుగా రూ.55వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సదానంద్, నారాయణ, మహేందర్, సంతోశ్ పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

జైనథ్: జిల్లా కేంద్రంలో ఈనెల 26న కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించే నిరుద్యోగ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని ఏఎంసీ మాజీ చైర్మన్ సంజీవ్‌రెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని దీపాయిగూడ, ఆనంద్‌పూర్, కూర, కరంజి, ఖాప్రి, పెండల్‌వాడ, నిరాల, బాలాపూర్, లేకర్‌వాడ, మాండగాడ, భోరజ్, తరోడ గ్రామాల్లో పర్యటించారు. నిరుద్యోగుల ఉసురుతీస్తున్న బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. సంజయ్ దుబే, అల్లూరి అశోక్ రెడ్డి, పూండ్రు భీంరెడ్డి, పిడుగు స్వామి, నారకట్ల వెంకన్న, శివనందు పాల్గొన్నారు.

26న ఆహారశుద్ధి పరిశ్రమల మిషనరీ ప్రదర్శన

కైలాస్‌నగర్: రాష్ట్ర ఆహారశుద్ధి పరిశ్రమల సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 26న ఆహార శుద్ధి పరిశ్రమల మిషనరీ ప్రదర్శనను పట్టణంలోని టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పద్మభూషణ్ రాజు ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈ ప్రదర్శనలో ఎస్‌హెచ్‌జీలు, డ్వాక్రా సభ్యులు, మహిళలు, నిరుద్యోగ యువత, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తల్లిదండ్రులూ.. పారాహుషార్

- పిల్లలను బలిగొంటున్న వేసవి సరదా
- సెలవుల్లో జాగ్రత్తలు తప్పనిసరి
- ఇండోర్ గేమ్స్ ఆడుకునేలా ప్రోత్సహించాలంటున్న నిపుణులు



ఎండలో సైకిల్‌పై తిరుగుతున్న చిన్నారులు



ఈత కొట్టేందుకు దుకుతున్న చిన్నారులు

బజార్‌హత్నూర్: వేసవి సెలవులు వచ్చయంటే విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోతోంది. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు ఈనెల 24 నుంచి వేసవి సెలవులు ప్రకటించింది. ఈ నేపథ్యంలో పిల్లలు వేసవి సెలవుల్లో తోటి విద్యార్థులతో, మిత్రులతో ఆడుకోవడానికి బయటకు వెళ్తుంటారు. సరదాకోసం ఇంట్లో చెప్పకుండా వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. మరో వైపు మండుతున్న ఎండలో తిరిగి అస్వస్థకు గురయ్యే అవకాశం ఉంది. పిల్లలకు పూర్తి స్వేచ్ఛనిస్తే చదువు, ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. పిల్లలు ఇంటి ఆవరణలో, నీడ ప్రదేశంలో ఆడుకునేలా, చదువుకునేలా తల్లితండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి.

బావులు, చెరువులు ప్రమాదకరం..

చిన్నారుల ఈత సరదా వారి ప్రాణాలను బలిగొనే అవకాశం ఉంది. వేసవి సెలవుల్లో మిత్రులతో కలిసి చెరువులు, నీటి కుంటలు, బావుల్లో ఈతకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతారు. తల్లితండ్రుల కళ్లుగప్పి వెళ్తుంటారు. ఇలాంటి పరిస్థితిలో తల్లితండ్రుల అప్రమత్తతే పిల్లలకు శ్రీరామరక్ష అని నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలు, వారి మిత్రులను ఒక దగ్గర కూర్చోబెట్టి చెరువులు, బావుల్లో ఈతకు వెళితే కలిగే ప్రమాదాల గురించి వివరించాలి. గత వేసవిలో సిరికొండ మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు ఫారంఫాండ్ గుంతలో పడి మృతి చెందారు. బోథ్ మండలంలోని సాకెరా గ్రామం వద్ద ఇద్దరు చిన్నారులు నీటి గుంతలోకి దిగి చనిపోయిన సంఘటనలను గుర్తుచేయాలి. ఇంటి నుంచి బయటకు వెళ్లిన పిల్లల కదిలికలపై నిఘా పెట్టాలి.

ఎండలో ఆటలు..

వేసవి సెలవుల్లో పిల్లలు ఎక్కువగా సామూహిక ఆటలపై ఆసక్తి చూపుతారు. క్రికెట్, డిల్లిదండా, గోలిలాట, కొమ్మకొచ్చి ఆటలతో పాటు పొలాల వెంట తిరుగుతూ పండ్ల సేకరణ చేస్తుంటారు. ఉదయం వెళ్లిన పిల్లలు మధ్యాహ్నం వరకు ఆటలోనే లీనమౌతారు. వెండ వేడికి డీహైడ్రేషన్ అయి వడదెబ్బకు తగిలే ప్రమాదం ఉంది. ఇంట్లో నీడకు ఆడుకునే ఆటలనే ప్రోత్సహించాలి. చెస్, క్యారంబోర్డు వంటి ఆటలు పిల్లల మేదస్సును పెంపొందిస్తాయి.

సెల్‌ఫోన్లు, టీవీకి దూరంగా ఉండాలి..

టీవీలకు, కంప్యూటర్‌లకు, వీడియో గేమ్‌లు, స్మార్ట్ ఫోన్‌లకు అతుక్కుపోతారు. దీంతో పిల్లలకు దృష్టి లోపం తలెత్తే ప్రమాదం లేకపోలేదు. సాధ్యమైనంత వరకు వాటిని ఎక్కువ చూడనీయకుండా తల్లితండ్రులు జాగ్రత్తపడాలి. ఆన్‌లైన్ గేమ్‌లు ఆడకుండా ఇంట్లో పెద్దలు ఎవరోఒకరు ఫోన్‌పై ఒక కన్నెసి ఉంచాలి. ముఖ్యంగా ఇతర సమయంలో పిల్లలను సెల్ ఫోన్‌లకు దూరంగా ఉంచడం మంచిది.

నీళ్లు ఎక్కువగా తాగించాలి

వేసవిలో పిల్లలు ఆటలపై ఎక్కువ మక్కువతో ఉంటారు. ఉదయం 10 గంటల్లోగా, సాయంత్రం 6గంటల తర్వాతే వెళ్లేటట్లు చూడాలి. పిల్లలు నీళ్లు ఎక్కువ తాగేవిధంగా చూడాలి. దీంతో డీహైడ్రెషన్ కాకుండా జాగ్రత్త పడాలి. ఫోన్ ఎక్కువగా చూస్తే కంటి రెటినపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

– భీంరావ్, ప్రభుత్వ వైద్యులు, బజార్‌హత్నూర్

ఈటల రాజేందర్ ఫ్లెక్సీ దహనం



ఫ్లెక్సీ దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని విమర్శించే నైతిక హక్కు బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు లేదని యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చరణ్ గౌడ్ అన్నారు. ఇటీవల రాజేందర్ కాంగ్రెస్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆయన ఫ్లెక్సీని దహనం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం పనిచేసే పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే ఈటల రాజేందర్ క్షమాపణ చెప్పాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నహీద్, రూపేష్ రెడ్డి, అంబకంటి అశోక్ పాల్గొన్నారు.

కేసు నమోదు చేయాలి

ఇచ్చోడ: కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఈటల రాజేందర్‌పై కేసు నమోదు చేయాలని ఏఐసీసీ సభ్యులు నరేష్ జాదవ్, నియోజకవర్గ నాయకులు అడే గజేందర్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన అనంతరం మాట్లాడారు. రేవంత్‌రెడ్డిని ఓర్వలేకనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో ఇచ్చోడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిముద్‌ఖాన్, మండల అధ్యక్షుడు క్లౌం నారాయణరెడ్డి, జిల్లా కార్యదర్శి భీమన్న, కొత్తూరి లక్ష్మణ్, ముస్తాఫా పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

బజార్‌హత్నూర్: భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆదివారం మండలంలోని పిప్రి గ్రామంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడమే కాకుండా హైదరాబాద్ నడి బొడ్డున 125 అడుగుల విగ్రహం ఏర్పాటు చేయటం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కవిత, రగన్ రెడ్డి, ఎంపీటీసీ పండుగ మురళీమోహన్, కానిందే రాజారాం, గంగాధర్, మహబూబ్, నర్సారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగోరావ్, ప్రకాష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో ఆదివారం అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ తుల శ్రీనివాస్, నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్‌లు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతిఒక్కరూ అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో పసుల చంటి, రమేశ్, లలిత, నాయకలు, మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామన్న, అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్

జైనథ్: సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకుపోతున్నారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం మండలంలోని మాకోడ గ్రామంలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్‌తో కలిసి పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ బలోపేతం కోసం కార్యకర్తలు, నాయకులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ఓటమి భయంతోనే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు చేస్తున్న విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాజకీయ పబ్బం గడుపుతున్న బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రౌత్ మనోహర్, రోకండ్ల రమేశ్, తుమ్మల వెంకట్ రెడ్డి, సర్పన్ లింగారెడ్డి పాల్గొన్నారు.

'కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తున్నారు'

ఎదులాపురం: కార్పొరేట్ కంపెనీలకు మోదీ ఊడిగం చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ ఆరోపించారు. ఆదివారం జీడీసీ కాలనీలో సీపీఐ ఇంటింటికీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైన దేశ వ్యాప్తంగా సీపీఐ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను సవరించారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో మోదీకి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, పప్పు, నూనె ధరలు పెంచి, సామాన్యుడి నడ్డి విరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్.విలాస్, సభ్యురాలు నళినిరెడ్డి, పట్టణ కార్యదర్శి అరుణ్ కుమార్, కృష్ణవేణి, అమీనా, మెహబూబ్, మెస్రం భీంరావ్, బెజ్జంకి నర్సింగ్, బోస్, స్వామి, శర్మ, ప్రకాష్, సంటెన్న పాల్గొన్నారు.

యువతికి అండగా బీఆర్‌ఎస్ నాయకులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని బీర్సాయిపేట గ్రామానికి చెందిన చెన్నూరి రవళి తన చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయింది. కాగా గత రెండు నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతుండడంతో బీఆర్‌ఎస్ నాయకులు బాధవత పూర్ణ చందర్‌నాయక్ హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించి, వైద్యం అందించారు. మండల పర్యటనలో భాగంగా నాయకులు రవళి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

సంప్రదాయాలను కాపాడాలి



మాట్లాడుతున్న వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్ కోరారు. ఆదివారం ఉట్నూర్ మండలంలోని కొత్తగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చాలా మంది మత మార్పిడి చేస్తూ వారి సంస్కృతికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆదివాసీలకు ఈమాసం ఎంతో పవిత్రమైనదన్నారు. కార్యక్రమంలో కటోడ వెడ్మ దేవు, పటేల్ వెడ్మ భీంరావు, ఇంద్రు, శ్యాంరావు, ఆత్రం శ్యామ్‌రావు, జ్యోతిరాం, తొడసం సుమన్, విశ్వేరరావు, గంగు, జంగు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

తాంసి: బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నాబార్డ్ అధికారి వీరభద్రుడు అన్నారు. ఆదివారం భీంపూర్ మండల కేంద్రంలో రైతువేదికలో పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు నాబార్డ్ సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. బ్యాంకు అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి పేదలు, వెనుకబడిన వారి అభ్యున్నతికి పాటు పడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లింబాజీ, డ్రీం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు గంగారం, రవీందర్, మాణిక్‌రావు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

తాంసి: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో అద్దె వ్యవసాయ ఉపకరణాల కేంద్రం ప్రారంభోత్సవానికి బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు రానున్నట్లు మండల కన్వీనర్ అరుణ్ తెలిపారు. ఉద యం 10గంటలకు ఐకేపీ కార్యాలయంలో తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాలకు చెందిన ట్రాక్టర్‌లు, వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

రేపు బీఆర్‌ఎస్ సమావేశం

బోథ్: బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఈనెల 25న పొచ్చెర క్రాస్ రోడ్డులోని సాయి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ నారాయణ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

అటెన్షన్ ప్లీజ్.. ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



గుడిహత్నూర్: మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. గాలి వానకు ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్తంభాన్ని సరి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: ఏఈ గౌతం, గుడిహత్నూర్, ఫోన్: 83339 23871

ఘనంగా బసవేశ్వర జయంతి



పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: బసవేశ్వర జయంతి వేడుకలను ఆదివారం జిల్లా కేంద్రంలోని బసవేశ్వర చౌక్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీరశైవ లింగయాత్, లింగ బలిజ సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఎమ్మెల్యే జోగు రామన్న హాజరై మాట్లాడారు. సమసమాజ స్థాపనకు ఆయన చేసిన కృషి ఏనలేనిదన్నారు. పట్టణంలో బసవేశ్వరా భవనం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, లింగయాత్ సమాజ్ ప్రతినిధులు జగదీశ్వర్, వెండి బద్రీశ్వర్, ప్రహ్లాద్, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఆదిలాబాద్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ రంగినేని మనీషా బసవేశ్వరుని విగ్రహానికి పూలమాల వేసి నివాలర్పించారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ మాట్లాడుతూ దేశ ఐక్యత కోసం బసవేశ్వర చేసిన కృషి ఎప్పటికీ మరచిపోలేదన్నారు. జిల్లా కేంద్రంలో బసవేశ్వర భవనం నిర్మించేలా అధికార పార్టీ నాయకులు కృషి చేయాలన్నారు.

బీసీ సంఘం ఆధ్వర్యంలో..

జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బసవేశ్వర జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో బసవేశ్వర చౌక్ వద్ద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్: సమసమాజ స్థాపనే ధ్యేయంగా బసవేశ్వర ఎంతో కృషి చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బసవేశ్వర చౌక్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దయాకర్, రత్నాకర్ రెడ్డి, ముకుందరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోథ్: మండల వ్యాప్తంగా బసవేశ్వర జయంతిని ఘనంగా నిర్వహించారు. బోథ్ పట్టణంలో సర్పంచ్ సురేందర్ జెండాను ఆవిష్కరించారు. మర్లపెల్లిలో తెలంగాణ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్, బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్, వీరశైవ లింగాయత్ సభ్యులు బసవేశ్వర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజు యాదవ్, వీరశైవ లింగాయత్ అధ్యక్షుడు దేవేందర్, గంగాసాగర్, వెండి సోమేశ్వర్, మాసం అనిల్, వెంకటేశ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్లీనరీని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్: బీఆర్‌ఎస్ ప్లీనరీని విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కులు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని మాన్కపూర్‌లో సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనెల 25న ఆసిఫాబాద్‌లో జరిగే బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవ మహాసభకు హాజరుకావాలన్నారు. ప్రతీ గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించాలన్నారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ఖానాపూర్ నియోజకవర్గ స్థాయిలో ఈనెల 25న నిర్వహించే ప్లీనరీ సమావేశానికి కార్యకర్తలు భారీ తరలిరావాలని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని కాగ్నే ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. ప్లీనరీ సమావేశానికి ప్రజలను తరలించేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో ఎంపీపీ పోటే శోబాబాయి, ఏఎంసీ చైర్మన్ జాదవ్ శ్రీరాంనాయక్, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, షేక్ సుఫీయన్, దేవ్ పూజే మారుతి పాల్గొన్నారు.


కూచిపూడి పరీక్షకు స్పందన

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని గౌతమ్ మోడల్ స్కూల్లో కూచిపూడి నృత్యం సర్టిఫికెట్ కోర్సు మొదటి సంవత్సరం పరీక్షలను ఆదివారం నిర్వహించారు. ప్రతీ ఏడాది విఘ్నేశ్వర కోకిల డాన్స్, మ్యూజికల్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో పరీక్షలను నిర్వహిస్తున్నారు. తెలుగు యూనివర్సిటీ నిర్వహించే కూచిపూడి సర్టిఫికెట్ కోర్సులో రాణించేలా శిక్షణ అందిస్తున్నట్లు నిర్వాహకులు దత్తు, ప్రవీణ్ తెలిపారు.



ప్రమాదకరంగా చేపల వేట





తాంసి మండలంలోని వడ్డాడి సమీపంలో మత్తడి వాగు ప్రాజెక్టు వద్ద పలువురు ప్రమాదకరంగా చేపలు పడుతున్నారు. ఎలాంటి భద్రత చర్యలు తీసుకోకపోవడంతో ప్రాజెక్టు గేట్ల వద్ద ఎత్తైన ప్రదేశంలో చివరి అంచున కూర్చోని చేపల వేట కొనసాగిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడే ఉంటున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

– తాంసి